శుభాహ్వానం!

తురగా జయశ్యామల

తండ్రి పిలుపుకి, చేతిలో పుస్తకం మంచంమీద పడేసి, లేచి హాల్లోకి వచ్చాడు రవి.

హాల్లో ఏదో సభ జరపబోతూన్నట్లు ఇంట్లో సభ్యులందరూ హాల్లోనే సమావేశమై ఉన్నారు. ఏదో ముఖ్య విషయంగురించి చర్చించబోతున్నట్లు, అందరి ముఖాలు ఓ మాదిరి సీరియస్‌గానే ఉన్నాయి.

"ఏమిటి, పిలిచారు?" అనడిగాడు తండ్రివంక చూస్తూ.

"కూర్చో!" అన్నాడు రవితండ్రి

"ఎక్కడ కూర్చుందామా?" అని హాలంతా కలయచూశాడు రవి. ఉహూ... ఖాళీలేదు. ఒక కుర్చీలో తండ్రి, మరోకుర్చీలో అన్నగారు ఆసీనులయి ఉన్నారు. సోఫాలో ముగ్గురన్న చెల్లెళ్ల ఫోటో తీయించుకోడానికి కూర్చున్నట్లుగా కూర్చున్నారు. ముందుహాలుని, వెనుకగదిని కలుపుతూన్న మధ్య గుమ్మంలో తల్లితలుపు కానుకొని కూర్చునివుంది. తమగది గుమ్మంలో వదినగారు స్వెట్టరు అల్లుకుంటూ, శ్రద్ధగా చెవులు ఇటు పెట్టి కూర్చుంది హాల్లో సంభాషణ వినడానికి అనువుగా.

టేబులు దగ్గర నుంచోడానికి తప్ప, కూర్చోడానికి చోటుదొరకని రవి అలాగే నిలబడి, ఫరవాలేదు, ఏమిటో చెప్పండి! అన్నాడు.

"మొన్న మనం చూసి వచ్చిన అమ్మాయి నచ్చిందని చెప్పావుటగా, మీ అమ్మతో" రవి తండ్రి అడిగారు.

"అవును! మెల్లగా అన్నాడు రవి.

"సరే, అయితే వాళ్లతో చెప్పమంటారా?"

"ఊ...! తలతిప్పాడు రవి..

"అమ్మాయి! నచ్చిందని చెబుతామనుకో. మరి మిగతా విషయాలగురించి కూడా అడగాలి కదా!"

"అంటే... ఏముంది. ఇచ్చిపుచ్చుకోవడాల సంగతి... మీ అమ్మ ఇరవైవేలు కట్నంగాను, లాంఛనాలి గురించి అడగమంటూంది! ఏమంటావన్నట్లుగా రవి ముఖంలోకి చూశారు ఆయన.

'మీ ఇష్టం...! ఆదర్శాలు, వల్లకాదు అంటూ పెద్దవాళ్ల అచ్చట్లు, ముచ్చట్లు జరుగనీయడంలేదు. రవి కూడా అలా ఏమన్నా అభ్యంతరాలు చెబుతాడేమోనని భయపడుతూనే చెప్పారు. కాని, రవి మీ ఇష్టం అంటూ ఒక్కమాటలో తేల్చివేయడంతో అందరికీ ఏదో బరువు దింపుకున్నట్లుగా ఫీలయ్యారు.

❖ ❖ ❖

మగ పెళ్ళివారు కోరిన కట్నం. ఇరవై వేలు, ఆపైన లాంఛనాలు ఎలా జరుపగలమా అని మధనపడిపోతున్నారు కామయ్య దంపతులు.

ఏవి అమ్ముకోవాలా, ఏం తాకట్టు పెట్టుకోవాలా అన్న ఆలోచనలో పడిపోయారు.

తల్లిదండ్రుల మధనపూర్తిగా అర్థం చేసుకొంది మంజు, కాబోయే పెళ్లి కూతురు.

ఏమిటో రెండురోజులుగా దీర్ఘాలోచన చేసి చేసి ఒక నిర్ణయానికి వచ్చి, అమలులో పెట్టాలను కుంది.

❖ ❖ ❖

నెలరోజులు గడచిపోయాయి.

ఓ రోజు ఉదయమే సారథి, రవీ! రవీ! అని పిలుస్తూ వచ్చాడు హడావుడిగా.

ఆ సమయంలో అందరూ ఇంట్లోనే ఉన్నారు.

సారథి, రవి ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. మంచి స్నేహితులు. సారథి రవికి స్నేహితుడే కాదు. రవికి కాబోయే అర్థాంగి మంజుకి పెద్దమ్మ కొడుకు. అసలతనే కామయ్యకు రవి గురించి చెప్పి, మన మంజుని అతనికిస్తే బాగుంటుంది. బాబాయ్! అతను నాలుగేళ్లుగా నాకు తెలుసు. ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం. మంచివాడు, ఆదర్శభావాలు గలవాడు! అని సారథి చెబితేనే, కామయ్య ఆ సంబంధంకోసం ప్రయత్నించాడు.

సెటిలయ్యింది.

ఏమిట్రా! ఇలా పొద్దున్నే వచ్చావు! నవ్వుతూ అడిగాడు రవి.

వివాహానికి విచ్చేయమని ప్రార్థించడానికి...! సారథి నవ్వుతూ అన్నాడు.

ఎవరిది?

నీది మాత్రంకాదు. ఎందుకా కంగారు! అంటూ కూర్చున్నాడు. ఇంతలో రవి తండ్రి వచ్చారు. ఏమిటయ్యా, సారథీ! ఈమధ్య కనిపించి చాలా కాలమైంది! అనడిగారు, రవికోసం తరచు ఇంటికి రావడం వలన సారథి ఆ ఇంట్లో అందరికీ పరిచయమే.

ఏదండీ... ఏవో కొన్ని పనులతో బిజీగా తిరుగుతున్నాము! ఆయన అడిగిన దానికి సమాధానంగా అన్నాడు సారథి.

ఏమిటయ్యా, అంత తీరికలేని వ్యవహారాలు నీకు!

"ఏదో యువకులంకదండీ... ఆదర్శాలు, ఆశయాలు ఆచరణలో పెట్టి, మీలాంటి పెద్దవారి ఆశీర్వాదం పొందాలని తీవ్ర ప్రయత్నంలో ఉన్నామండి!

'అవునోయి, ఆశయాలుండగానే సరిపోయిందా? ఆచరణలోకూడా చూపించాలి. చదువుకున్నవాళ్ళు మీ లాంటి యువకులే కదయ్యా, చేయాల్సింది!

అవునండి! అసలే మాది యువరక్తం. చెప్పింది చెయ్యాలనే, ఆశయాలని ఆచరణలో పెట్టాలనే మా ఆరాటం. అందుకు మీ ఆశీర్వాదం కావాలి...!

మంచిపనం టే తప్పక ఆశీర్వాదం లభిస్తుంది. సారథీ! రవితండ్రి సంతోషంగా అన్నారు.

చాలా సంతోషమండీ! మాలాంటి యువకులు చెయ్యబోయే పనికి, మీలాంటి పెద్దలందరూ మెచ్చి, దీవెనలందిస్తే మేమెటువంటి పనైనా సాధించి, ప్రగతి పథానికి వెళ్లగలం సార్!

అసలింతకీ విషయమేమిటోయి!

"అదే చెబుతున్నానండి. మా స్నేహితుడొకడికి, మా ఫ్రెండ్సందరం కలిసి ఓ ఆదర్శ వివాహం జరుపబోతున్నాం. వాళ్లింటో ఆ వివాహానికి వ్యతిరేకించారు. కాని, ఆ అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు బాగా నచ్చారు. ఇంట్లో పెద్దవాళ్ళు వాళ్ల ఆశయాల్ని అర్థం చేసుకోపోవడంతో మేమందరం కల్పించుకోవలసి వచ్చింది. వంద అబద్ధాలాడైనా ఓ పెళ్లి చేయమన్నారు మన పెద్దలు. ఈ పెళ్లికి వాళ్ల తరపు పెద్దవాళ్లెవరూ రారు. కనుక మీరు, అమ్మగారు వచ్చి ఆ నూతన వధూవరులను ఆశీర్వదించాలని మా కోరిక... "అంటూ ఆగాడు సారథి.



"తప్పకుండా వస్తాము, సారథీ! పెద్దవాళ్లు చెయ్యలేని పనిని, చిన్నవాళ్లు మీరు చేస్తుంటే, చూసి ఆనందించడానికేమిటోయి!"

'అందరూ రావాలి...!' అని చెప్పి, నేను వెడతానోయి రవీ! అన్నాడు సారథి వెళ్లడానికి లేస్తూ.

'అసలింతకీ ఎక్కడయ్యా వివాహం జరిగేది? రవి తండ్రి అడిగారు.

'క్షమించాలి. చెప్పడం మరచాను. నేను అద్దెకుంటున్న వీధిలోనే రామాలయం ఉంది కదండీ! రామాలయం మండపంలోనే, చాలాక్లుప్తంగా జరుగుతుంది. శుభలేఖలు వేయించడానికి టైములేదు. రాత్రి 8 గంటలకు ముహూర్తం. తప్పకుండా రావాలి! అంటూ నేమరోసారి అందరి దగ్గరా సెలవు తీసుకొని బయటపడ్డాడు సారథి.

❖ ❖ ❖

"ఏయ్, మంజూ! రేడీనా?" మధ్యాహ్నం మూడు గంటలకే గాలిదుమారంలా దూసుకువచ్చాడు సారథి.

"ఎక్కడికన్నయ్యా?" తెలీనట్లే అమాయకంగా అడిగింది మంజు.

"పిచ్చిముఖమా!" అప్పుడే మర్చిపోయావా? ఇవాళ లత పెళ్లి అని చెప్పానుకదా!

'అయ్యో! మర్చిపోయాను. ఎంత ఒక్క అయిదు నిముషాలలో తయారయి వచ్చేస్తాను!" బాత్‌రూమ్‌వేపు పరుగుతీసింది మంజు.

"ఇప్పటినుంచి ఎందుకురా! రాత్రి ఎనిమిది గంటలకన్నావుగా పెళ్లి!" అంది సారథితో శాంతమ్మగారు.

ఉదయం రవి తల్లిదండ్రులకు విషయం చెప్పి, వివాహానికి ఆహ్వానించినట్లుగానే, మంజు తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాడు.

"అదికాదు, పిన్నీ! పెళ్లి కూతురు లత తరపున కూడా ఎవరూ రావడంలేదుకదా! తనకితోడుగా ఉంటుందని, పెళ్లి కూతురిని కాస్త ముస్తాబుకూడా చేయాలి కదా! అయినా, నేనుంటాగా నీకెందుకు భయం!" అన్నాడు.

అన్నట్లుగానే మంజు పట్టుచీర ఒకటి బాగ్‌లో పెట్టుకొని, తయారయి వచ్చింది.

❖ ❖ ❖

రామాలయం మండపం పచ్చని మామిడి తోరణాలతో, రంగు, రంగుల కాగితాల తోరణాలతో, లైట్లతో దేదీప్యమానంగా ఉంది.

ఆ గుడి ఆవరణ అంతా అబ్బాయిలు, అమ్మాయిలతో కళకళలాడి పోతూంది. ఆనందం... ఉత్సాహం పొంగులువారుతున్న ఆ యువతీ యువకులు, ఆ పెళ్లి మండపానికి శోభను చేకూరుస్తున్నారు. ఆ వివాహానికి అసలు సూత్రధారి అయిన సారథి హడావుడిగా తిరుగుతున్నాడు. అతను పాంటుమీద సిల్కు లాల్చీ వేసుకొని ఉన్నాడు. ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లు మాటిమాటికీ గుడి ద్వారం దగ్గరకి వెళ్ళి చూస్తున్నాడు.

'సారథీ.. సారథీ' అంటూ అమ్మాయిలు, అబ్బాయిలు వచ్చి ఏవో సంప్రదింపులు జరిపి సలహాలడుగుతున్నారు.

ఇంతలో రవి తల్లిదండ్రులు వచ్చారు.

సారథి వాళ్ళని సాదరంగా ఆహ్వానించి, కూర్చోడానికి చోటు చూపించాడు.

వాళ్ళు కూర్చుని నలుమూలలా చూస్తూ 'రవి ఏడీ?' అనడిగారు.

'వస్తాడు. గోల్డ్‌స్పాట్‌లు పట్టించుకు రావడానికని అలా బయటకు వెళ్ళాడు! అని చెప్పాడు సారథి.

మరో పది నిముషాలకు మంజు, తల్లిదండ్రులు వచ్చారు.

'రండి బాబాయ్! రా పిన్నీ మీ కోసమే ఎదురుచూస్తున్నాను అంటూ రవి తండ్రి అనంతయ్య వాళ్ళున్న పక్కనే చోటు చూపించాడు సారథి.

కాబోతూన్న వియ్యంకులిద్దరూ అక్కడ కలుసుకుని నవ్వుతూ ఒకరినొకరిని పలకరించుకున్నారు. వియ్యపురాళ్లిద్దరూ కబుర్లలో పడ్డారు.

బావగారూ! మీకివ్వాల్సిన పైకం అంతా జమ చేశాను. రేపులేదు... ఎల్లుండి మంచిరోజు, పట్టుకువచ్చి ఇస్తాను. ముహూర్తాలుకూడా ఆరోజే నిర్ణయించుకోవచ్చు! కామయ్య, తగ్గుస్థాయిలో రహస్యం చెబుతున్నట్లుగా అన్నాడు అనంతయ్యతో.

'అలాగే... అలాగే!' అన్నాడు అనంతయ్య, ఇంక ఆ విషయాలిక్కడ మాట్లాడకన్నట్లు తొందరగా.

(మిగతా 12వ పేజీలో)

కథా రచయితలకు మనవి!

తెలుగువారి జీవితానికి అద్దం పట్టే, అందమైన, కఠోరసత్యభరితమైన, హాస్య రసమయమైన కథానికలను 'ఆదివారం ఉదయం'లో ప్రచురణకి పంపించండి. ప్రచురించిన కథకి రూ. 150 పారితోషికం ఉంటుంది. కథ అయిదు అరఠావు పేజీలకు మించకుండా ఉంటే మంచిది. ఇతర నియమ నిబంధనలన్నీ షరా మామూలే.

కథలు పంపవలసిన చిరునామా
ఎడిటర్
ఆదివారం ఉదయం
7/1, ఆజామాబాద్. ఆర్.టి.సి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ 20.

మాల్గుడి 'డేస్' మళ్లీ రావు!



గాలి స్పర్శించినప్పుడల్లా మొక్క ప్రతిస్పందించాలి. కన్ను చూపు సారించినప్పుడల్లా క్రొవ్వె గొడుగుపట్టాలి.

అప్పుడే మొక్క... మొక్క!

అప్పుడే క్రొవ్వె... క్రొవ్వె!

ఇపుడిపుడే మొగ్గతొడుగుతున్న కన్నడ సినిమా మొక్క కుప్పకూలింది. క్రొవ్వె మూతబడింది.

కొత్త ఆలోచన స్పర్శించినప్పుడల్లా ప్రతిభ స్పందించాలి. ఆచరణ చూపు సారించినప్పుడల్లా పట్టుదల గొడుగు పట్టాలి.

అప్పుడే ప్రతిభ... ప్రతిభ!

అప్పుడే పట్టుదల... పట్టుదల!

ఇపుడిప్పుడే శాఖోపశాఖలవుతున్న ఓ ప్రతిభ కుప్పకూలింది. పట్టుదల శ్వాస నురిచింది.

ఆ ప్రతిభ... శంకర్ నాగ్!

ఆ కన్నడ సినిమా క్రొవ్వె... శంకర్ నాగ్!

'టెలి సీరియల్ 'మాల్గుడి డేస్' మీకు గుర్తుందా?' అని మనం ఎవరినీ అడగనవసరంలేదు. ఎందుకంటే— అది ఎవరూ ఎప్పటికీ మరచిపోలేని మంచి సీరియల్!

అన్నిట్లోకి... బాల్యాన్ని దృశ్యీకరించడం కష్టం. అలాగే— ఓ రచనను తెరకెక్కించడంలో ప్రేక్షకుల్ని మెప్పించవచ్చునేమో కానీ ఆ రచన తాలూకు రచయితను తృప్తిపరచడం ఇంకా కష్టం. అయితే— ఈ రెంటినీ దర్శకుడిగా 'మాల్గుడి డేస్' టెలి సీరియల్లో సాధించాడు శంకర్ నాగ్. ఇందుకు శంకర్ నాగ్ కన్నుమూశాక 'మాల్గుడి డేస్' రచయిత ఆర్.కె.నారాయణ్ అన్న మాటలే సాక్ష్యం.

'నా మిగిలిన రచనలకు కూడా ప్రాణప్రతిష్ఠ చేయడానికి శంకర్ నాగ్ ఇవాళో రేపో వస్తాడని ఎదురుచూస్తున్నాను... ఇప్పుడీ 'బాధ్యత'ను ఎవరికని అప్పజెప్పేది నేను?'

నిజమే! మాల్గుడి 'డేస్' మళ్లీ రావట్లే ఆ 'బాధ్యతా' తిరిగి రాదు. 'యాక్సిడెంట్' చిత్రంతో దర్శకుడిగా కళ్ళు విప్పిన శంకర్ నాగ్ యాక్సిడెంట్‌లోనే కనుమూయటం కాకతాళీయమే అయినా... కన్నడ సినిమాకి బలీయమైన దెబ్బ.

36 సంవత్సరాల శంకర్ నాగ్ కన్నడ సినీ సూపర్ హీరో అనంత్ నాగ్ సోదరుడు. అయితే ఆ రంగంలో అతడి రాణింపు 'బంధుత్వం'తో వచ్చిందికాదు... ప్రతిభ, సామర్థ్యంతో వచ్చింది. ఫీల్డ్‌లోకి అడుగుపెట్టక ముందు బ్యాంక్ ఉద్యోగి. తర్వాత మరాఠీ, గుజరాతి రంగస్థలాలకు 'సెట్ డిజైనర్'. ఆ తర్వాత మరాఠీ, కన్నడ నాటకాల నటుడు. అటు తర్వాతే సినిమా రంగం—

మొదటిసారి గిరీష్ కర్నాడ్‌ను కలుసుకున్నప్పుడు—శంకర్‌ను చూసిన గిరీష్ 'ఈ కుర్రాడిలో 'ఫీచర్స్' బావున్నాయే' అనుకున్నాడు. అయితే— శంకర్ ఆయన సినిమాలో 'పాత్ర' కోసం నోరు విప్పలేదు... తెరవెనుక 'పాత్ర'కే ఇష్టపడ్డాడు. 'నాకు మీ దగ్గర సహకార దర్శకత్వం నేర్చుకునే అవకాశం ఇవ్వండి!' అనే అడిగాడు. 'నో నువ్వు నాకు నటుడిగానే కావాలి!' అన్నాడు గిరీష్. శంకర్ ఒప్పుకోలేదు. ఒప్పించడానికి అనంత్ నాగ్ సహాయం తీసుకోవలసి వచ్చింది గిరీష్‌కి.

గిరీష్ కర్నాడ్ 'ఒండ నొందు కులదెళ్లి'గా రూపొందించిన ఆ చిత్రంలోని శంకర్ నాగ్‌లోని నటుడు తన నటనకుగాను 'బంగారు నెమలి'ని అందుకున్నాడు. సత్యజిత్ రే నుండి బంగారు ప్రశంసనందుకున్నాడు. ఆ తర్వాత నటుడిగా కనిపిస్తూ— బొంబాయిలో సాయిపరంజపే దగ్గర 'దర్శకుడి'గా ఎదిగాడు. అక్కడే రంగస్థల కార్యక్రమాల్లో నక్షత్రంలా వెలిగిపోతున్న మహారాష్ట్రుల అమ్మాయి 'అరుంధతి'తో ఏర్పడిన పరిచయం పెళ్ళితో ముడిపడింది. ఇప్పుడు వారికో పాప— 'కావ్య'

శతచిత్ర నటుడిగా తిరుగులేని బావుటా ఎగురవేసిన శంకర్ నటజీవితంలో... 'సీతారాము', 'మూగవసేదు', 'ఆటో రాజా, 'ఆరాదగయు', 'వజ్రమష్టి', 'నోద్ స్వామి నావిరోద్ హేగే' చిత్రాలు మరపురాని మెరుపులు. ఇటీవలి 'భలే చతుర' చిత్రం ఇంకా విజయవంతంగా ఆడుతోంది.

శంకర్ నాగ్ కన్నడ రాష్ట్ర రాజకీయాల్లో కూడా చురుకైన పాత్రధారి! 1985లో జనతాపార్టీ తరపున సోదరుడు అనంతనాగ్ తో కలిసి పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నాడు. ఇక్కడితో అతడి చొరవ ఆగిపోలేదు. బట్టల ఎగుమతి, మెడికల్ క్లినిక్‌లు నడపడం, ఇలా బహుముఖ ప్రతిభ శంకర్ నాగ్‌ది.

ఇటీవలె... హోటల్స్ సంస్కృతిలో, కొత్తగా వెలుగుచూస్తున్న 'కంట్రీ క్లబ్' (విశ్రాంతి నెలవు)కు బెంగుళూరులో పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టారు. అన్నిటికీ మించి కన్నడ సినిమాను సొంత కాళ్లమీద నడపడం కోసం 'ఎలక్ట్రానిక్ రికార్డింగ్ థియేటర్'ను ఆరంభించారు. దీంతో కన్నడ నిర్మాతలకు మద్రాస్ ప్రదక్షిణాలు తప్పాయి.

'చిల్డ్రన్స్ ఫిలిమ్ సొసైటీ' భవనాన్ని నిర్మించాలని, బెంగుళూరు పెద్ద సినిమా థియేటర్ అన్నింటినీ ఒకే థియేట్రికల్ ప్రొడక్షన్‌తో నడపాలనీ... శంకర్ నాగ్ కన్న కల కలగానే మిగిలింది.

గిరీష్‌కర్నాడ్ మాటల్లో చెప్పాలంటే బహుముఖ సినీ ప్రతిభ భవిష్యత్తు కోల్పోయింది. కన్నడ సినీ కల చెదిరిపోయింది!

నిజమే—

సినీ ప్రేక్షకుడు—

'నిదుర లేస్తే చిన్నకల చెదిరిపోతుంది. నిదురపోతే పెద్దకల ముగిసిపోతుంది!' అన్న వేదాంతంలోకి మరో సారి...

—దాసరి దుర్గాప్రసాద్

ఈవారం కథ

(11వ పేజీ తరువాయి)

శాంతమ్మకిదంతా అయోమయంగా ఉంది. పెద్దవాళ్లంటూ వచ్చింది తాము నల్గురూ మాత్రమే. మిగతా వాళ్లందరూ అబ్బాయిలు, అమ్మాయిలు. సంతోషంగా, ఉత్సాహంగా పరుగులు పెడుతూ, నవ్వుతూ, తుళ్లుతూ, జోకులు వేసుకుంటూ తిరుగుతున్నారు. అందరిలోనూ ఏదో చైతన్యం... నవచైతన్యం... యువచైతన్యం. గుడిపూజారికి కూడా ఇదంతా సంబరంగా ఉంది. చిన్నవాళ్లే పెద్దవాళ్లయి పెళ్లి చేయడం అదే ప్రథమం ఆ గుళ్లో మరి.

మండపంలో ఒకపక్కగా, ముచ్చటగా వివాహవేదిక తయారుచేశారు. దాని అలంకరణ అంతా సారథి మిత్రులది. దానికి పూలదండలు అవీ పెళ్లి కూతురు లత స్నేహితులు అలంకరించారు.

గుళ్లోపూజచేస్తున్నా పూజారిగాక, మరొక పురోహితుడక్కడికి వచ్చాడు, గుడివెనక నుంచి.

బాబూ! లైమవుతోంది. వధూవరులను పిలవండి! అన్నాడు సారథితో.

సారథి, మరొక అమ్మాయి గుడివెనకగా వెళ్లారు.

ఏమండోయి, శాస్త్రులుగారూ! పెళ్లి చాలా తొందరగా, అంటే ఓన్లీ టెన్ మినిట్స్‌లో అయిపోవాలి...! ఎవరో ఒక యువకుడు హెచ్చరించాడు పురోహితుడ్ని.

అలాగే, బాబూ! ఆ మాట మీరు వేరే చెప్పాలా? కాలాన్నిబట్టే మేమూ మారుతున్నాం. ఇదివరకు గంటల తరబడి, రోజుల తరబడి పెళ్లి తంతు జరిగేది. ఇప్పుడో... గంటంటే గంట... అరగంట అంటే అరగంట స్పీడ్... అంతా స్పీడ్ కదా! వధూవరులకు కావాల్సింది మీ ఆశీర్వచనమేకదయ్యా! అది నిమిషంలో చెప్పినా, గంటలో చెప్పినా ఒకటేనయ్యా! అన్నాడాయన ఏకబిగిన.

ఇంతలో గుడివెనుకనుంచి సారథి వెంట వరుడు, ఆ అమ్మాయి వెంట వధువు కళ్యాణవేదిక దగ్గరకు వచ్చారు.

పెళ్లికుమార్తెను చూసిన కామయ్య ముఖంలో రంగులు మారిపోయాయి. అలాగే వరుడిని చూసిన అనంతయ్య ముఖంలోనూ.

"ఎవరది... రవికాదూ!" అనుకున్నాడు అనంతయ్య

'సారథీ! ఏమిటా ఇది?" కామయ్య గట్టిగా అంటూ లేచి నుంచున్నాడు.

తొందరగా ముందుకు వచ్చాడు సారథి.

అంతవరకు ఎంతో ఉత్సాహంగా, ఆహ్లాదకరంగా, సందడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా నిశ్శబ్దమయిపోయింది.

"బాబాయ్... మీరు కంగారు పడవద్దు...!

"కంగారు పడవద్దంటావేమిటి? అది మంజు కాదూ" ఆవేశపడుతూ అడిగాడు కామయ్య.

పెళ్లి కుమార్తె లత... అహో మంజులత, భయంగా తండ్రివేపు చూసింది. శాంతమ్మ కంగారుగా లేచి నుంచుంది. ఇదంతా చూసి.

"ఒరేయ్, రవీ! ఏమిటా ఇది... పెళ్లి, పెళ్లి అంటే ఇంకా ఎవరిదో అనుకున్నాను...! అనంతయ్య రౌద్రంగా రవి... రవిశేఖర్ వేపు వెళ్లబోయాడు.

చేతులతో అడ్డుకున్నాడు సారథి. చూడండి... మీరు పెద్దలు... నిదానించండి. తొందరపడకండి!

కామయ్య, సారథి మాటలు పూర్తి కాకుండానే క్రోధంతో అరిచాడు. ఒరేయి. మాయమాటలు చెప్పి మమ్మల్ని, ఇలా అవమానిస్తావా? ఇదంతా నువ్వు చేశావు...!

"అవును, బాబాయ్. నేనే చేశాను. అయితే, ఎందుకిలా చేశానో చెబుతాను, వినండి...!

వాళ్లేహోయి, నిర్వాకం! మరో నెలలో వీళ్ల పెళ్లికి మేము ముహూర్తం పెట్టబోతూంటే, ఏమిటిది? అని సారథితో అని, మతిచెడిందా ఏమిటి నీకు. నదు ఇంటికి చేసిన ఘనకార్యం చాలు, అనంతయ్య ఎగిరిపడ్డాడు రవిమీద.

రవి మాట్లాడలేదు. మౌనంగా సారథి వంక చూశాడు.

"పెద్దలు నన్ను మీరు క్షమించాలి. రవి, మంజు ఇలా నిరాడంబరంగా వివాహం చేసుకోవాలని నన్ను వారధిని చేసుకున్నారిద్దరు. అందుకు తగినంత కారణం లేకపోలేదు. రవి అభ్యుదయ భావాలు గలవాడు. అతనికి కట్నం తీసుకోకుండా వివాహం చేసుకోవాలని కోరిక. మంజుకికూడా అదే ఆదర్శం. కట్నం ఇవ్వకూడదని, ఇచ్చి తన తల్లిదండ్రులు అప్పులపాలయి వీధిన పడకూడదని.

రవి తండ్రి అనంతయ్యగారు ఇరవై వేలు కట్నం అడిగారు. అమ్మాయి పెళ్లి చేసి ఎలాగైనా ఆమె బాధ్యత తీర్చుకోవాలని ఆడపిల్లని కన్నతండ్రిగా బాబాయి అనుకున్నారు. అందుకు ఉన్న ఇల్లు తాకట్టు పెట్టడానికి సిద్ధపడ్డారు. రవికి, మంజుకి ఇది మాత్రం ఎంతమాత్రం ఇష్టంలేదు. నన్ను వారధిగా చేసుకొని ఇంత కథ నడిపారు.

బాబాయ్! మనసు మనసు కలవాలిగాని, మిగతావన్నీ పైపై మెరుగులును, ఆడంబరాలూను. మేము యువకులం. మేం మారి ప్రగతి పథంలోకి పయనించాలనే సత్సంకల్పంతో ఇటువంటి దురాచారాలను అరికట్టాలని నిశ్చయించుకున్నాం. అందుకు పెద్దలు మీరు కూడా విశాల దృక్పథంతో మాకు సహకరించడం మీ ధర్మం. మీకీ విషయం చెబితే ముందే వద్దంటారేమోనని, పైగా కట్నం కానుకలందలేదనే నెపంతో వివాహం ఎక్కడ చెడగొడతారోనన్న భయంతో చెప్పలేదు. అంతేగాని మరో ఉద్దేశ్యం ఏమీలేదు. తల్లిదండ్రులు మంచి మనసుతో ఇచ్చిన ఆశీర్వాదం పిల్లల జీవితాలని సుఖమయం చేస్తాయి. కనుకనే మీ ఆశీర్వాదం వాళ్లకు లభించాలనే కోరికతో మిమ్మల్నీ సమయంలో ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది. మీరు వాళ్లని ఆనందంగా ఆశీర్వదించడం మీ కర్తవ్యం...! అంటూ ఆగాడు సారథి.

అనంతయ్య రక్తం ఉడుకెత్తిపోయింది. రవి తనతో ఒక్కమాట చెప్పకుండా, ఇలా నలుగురిలో ఎలా పరువు తీశాడు. వీడి పెళ్లికి కట్నం తీసుకోవాలనుకోవడం, తాను మూటకట్టి దాచుకోవడానికనా! వాడికట్నంతో వాడి చెల్లెలు పెళ్లి చేద్దామని కాదూ...! అదే మాట మనసులో ఉంచుకోలేక సారథితో అనేశారాయన.

ఆ విషయం గురించి మీరు వర్రీ అవకండి. ఈ శుభ సమయంలో నేనింకో శుభవార్తకూడా చెబుదామనుకుంటున్నాను. మీ చిన్నమ్మాయిని, కానీ కట్నం లేకుండా నేను చేసుకుంటాను! మాట ఇస్తున్నట్లుగా అనంతయ్య చేతిలో చేయివేసి మరీ చెప్పాడు సారథి.

ఆనందంతో నోటమాట రానట్లుగా నిలబడి పోయారొక్షణం. అంత ప్రయత్నమూ అయిపోయింది. పెళ్లి అనేది ఎక్కడ జరిగినా, ఎలా జరిగినా పెళ్లి పెళ్లే. పైగా పవిత్రమైన దేవాలయంలో... ఆదర్శమూర్తి అయిన శ్రీరామచంద్రుని ఎదుట... కాదని తీసుకుపోతే అది ఎంత అప్రతిష్ఠ... పీటలమీద పెళ్లి చెడగొడితే ఎంత పాపం... ఎంత నవ్వులపాలు... అనలావని దేవుడు మెచ్చుతాడా? ఇటు అనంతయ్య మనసులోను, అటు కామయ్య మనసులోను అదే ఆలోచన.

వారిద్దరూ మౌనంగా నిలబడి పోవడం చూసి, మీరిప్పుడు వారిని కోపంతో లాక్కుపోవాలని ప్రయత్నించినా, అది జరగని విషయం. ఎందుకంటే, ఈ వివాహం వారిష్టప్రకారం జరుగుతూంది. పైగా వాళ్లు మైనారిటీ తీరినవాళ్లు...! అన్నాడు సారథి ఒక విధంగా హెచ్చరిస్తున్నట్లుగా.

కామయ్యకిది ఒకవిధంగా సంతోషంగానే అన్పించింది. ఇదీ ఒకందుకు మంచిదే... తనకెంత ఖర్చు తప్పింది!

అయితే అనంతయ్యకి మనసులో కారం రాసుకున్నట్లుగా అన్పించింది. బిళ్లకుదుముల్లా చేతుల్లో పడవలసిన ఇరవై వేలు, వెనక్కు వెళ్లాయి. ఇప్పుడేమన్నా నల్గురిలో తనే అల్లరవుతాడు. గుడ్డిలో మెల్లలా సారథి కట్నం తీసుకోకుండా తన కూతుర్ని వివాహం చేసుకుంటానని చెప్పాడు. అందుకే సంతోషించాడు. సారథి లాంటి అల్లుడు దొరకడం మాటలా? ఇంతవరకు వచ్చాక మేము మాత్రం ఎందుకడ్డం చెబుతాము. ఎలాగూ మేము నిర్ణయించిన సంబంధమే కదా, మాకేమాత్రం శ్రమలేకుండా జరిపించేస్తున్నారు. ఇదీ ఒకందుకు మంచిదే! అన్నాడు అనంతయ్య

సారథి ముఖం ఆనందంతో వెలిగిపోయింది. నాకు తెలుసు మీరింక అడ్డుచెప్పరని, మా యువకులు చేసే మంచి పనికి మీ ఆశీర్వాదం లభిస్తుందని. అవును, బాబాయ్! మా యువతరం [illegible] ది. ఇంకా మారుతుంది. ఇటువంటి సాంఘిక దురాచారాలను మాపడంలో ఇంకా ఎంతో మారవలసి వుంది. యువశక్తి తలచుకోవాలేగాని, చెయ్యలేనిదంటూ ఏమీలేదు. సాధించలేనిది లేదు. మాలోని బూజు పట్టిన భావాలను తొలగించుకొని, మమ్ము మేము సంస్కరించుకొంటూ ముందడుగు వేస్తాం... అందుకు అనుభవం పండిన మీలాంటి పెద్దలు చేయూతనివ్వాలి. తగిన సలహాలనివ్వాలి. ఇక్కడ చేరిన మా ఫ్రెండ్స్ అందరం అమ్మాయిలు, అబ్బాయిలు ఒక నిర్ణయానికి వచ్చాం... మాలో ఎవ్వరం మా చెల్లెళ్లకు... అన్నలకు కట్నాలివ్వం... అలాగే పుచ్చుకోముకూడా...! అంటూ ఆగాడు సారథి.

అనంతయ్య, కామయ్య విస్మయానందాలతో సారథి వేపు చూశారు. ఆ తర్వాత అక్కడ చేరిన యువతీ యువకులందరివంకా చూశారు. ప్రతి ఒక యువకుడిలోను, యువతిలోను ఏదో దృఢనిశ్చయం స్పష్టంగా కన్పిస్తూంది. నిజమే! ఉత్సాహం ఉరకలువేసే వేడి రక్తం పరుగులు తీసే ఈ యువత తలుచుకుంటే చెయ్యలేనిది ఏముంది? అన్పించింది.

రవి, మంజు మీతో చెప్పే ధైర్యంలేక, చెప్పినా జరుగుతుందనే నమ్మకంలేక నన్ను సూత్రధారిని చేశారు. ఎందుకని, మీరు వాళ్ల భావాలతో సహకరించరేమోనని... అంతకంటే పెద్దలయెడల నిర్లక్ష్యభావన కలిగి మాత్రం కాదని చెబుతున్నాను... నన్ను మాత్రం వారిద్దరూకూడా క్షమించాలి! అని ఫ్రెండ్స్ అందరివేపు తిరిగి, బాబాయిగారు సమాయానికే వచ్చారు... కన్యాదానం ఆయనే చేస్తారు! అన్నాడు.

సారథి స్నేహితులందరూ కరతాళధ్వనులు చేశారు.

పెద్దలలోకూడా ఉత్సాహం పొంగుకు వచ్చింది. అంత మంది యువతీ యువకుల మధ్య వాళ్లూ యువకులయిపోయారు.

ఇదంతా చూస్తున్న పురోహితుడు, భలే వాళ్లయ్యా మీరు! కొన్ని వందల పెళ్లిళ్లు చేయించానుగాని, ఇటువంటి వివాహం చూడలేదు. ఏది తల్చుకున్నా... ఏది చెయ్యాలన్నా మీ యువకులకే సాధ్యంగాని, మా లాంటి వాళ్లం ఏం చెయ్యగలం... ఆ... ఆ... ముహూర్తం సమీపించింది. పీటలమీద కూర్చోండి, కన్యాదాతయూ, వధూవరులును...! అని అంటూంటే, శాంతమ్మ లేచి మంజు దగ్గరగా నడిచింది.

కామయ్య మండపంవేపు అడుగులు వేశాడు.

❖ ❖ ❖